మూడేళ్ల విరామం తర్వాత ప్రజావాణి

ఫిర్యాదులు స్వీకరించిన ఉపకమిషనర్ మల్లయ్య

కుత్బుల్లాపూర్: మూడేళ్ల విరామం తర్వాత ప్రజావాణి కార్యక్రమం సోమవారం తిరిగి ప్రారంభమైంది. కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదులు చేసేందుకు పలు కాలనీలు, బస్తీల ప్రజలు తరలివచ్చారు. ఇంజినీరింగ్(1), టౌన్‌ప్లానింగ్ (2), అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ (1), ఎలక్ట్రికల్ (1), శానిటేషన్(1) మొత్తం 6 ఫిర్యాదు రాగా వాటిని స్వీకరించిన ఉపకమిషనర్ మల్లయ్య తగు చర్యలు చేపడతామన్నారు.

'ప్రధాన రహదారిలో ఆక్రమణలను తొలగించాలి'



ఉపకమిషనర్ మల్లయ్యకు వినతి పత్రం అందజేస్తున్న మహదేవపురం కమిటీ సభ్యులు

సుభాష్‌నగర్: ప్రధాన రహదారిలో ఆక్రమణలను తొలగించి రాకపోకలు సజావుగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని సోమవారం గాజులరామారం డివిజన్ మహదేవపురం వెల్ఫేర్ సొసైటీ సభ్యులు ఉప కమిషనర్ మల్లయ్యను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. వంద ఫీట్ల మేర ఉన్న మహదేవపురం ప్రధాన రోడ్డు ఆక్రమణలతో కుంచించుకుపోయిందని అన్నారు. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అదే విధంగా కాలనీ అసోసియేషన్ భవనాన్ని స్థానిక అవసరాల నిమిత్తం తిరిగి అప్పగించాలని కోరానన్నారు. దీనిపై ఉపకమిషనర్ సానుకూలంగా స్పందించి తగు చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. అదే విధంగా కాలనీ అసోసియేషన్ సభ్యులు సబ్ రిజిస్ట్రార్‌ను కలిసి గతంలో ఆగిపోయిన ప్లాట్ల రిజిస్ట్రేషన్లు కొనసాగించాలని కోరగా కోర్టు ఆర్డర్ కాపీ ఉంటే 30 రోజుల్లో రిజిస్ట్రేషన్ చేస్తామన్నారు. సొసైటీ ఉపాధ్యక్షుడు రంగారావు, ప్రధాన కార్యదర్శి ప్రసాద్, సంయుక్త కార్యదర్శి రామచంద్రారెడ్డి, ట్రెజరర్ ప్రభాకర్‌రెడ్డి, సభ్యులు మహేశ్వర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్ రెడ్డి, శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

ఎఫ్‌టీఎల్‌లో చేపట్టిన నిర్మాణాలపై ఫిర్యాదు



దుండిగల్ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న కొంపల్లి మున్సిపల్ కాంగ్రెస్ నాయకులు

కుత్బుల్లాపూర్: చెరువులు, నాలాలపై నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కొంపల్లి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బైరి ప్రశాంత్‌గౌడ్ అన్నారు. కొంపల్లి, దూలపల్లి పరిధిలోని చెరువుల ఎఫ్‌టీఎల్‌ల పరిధిలో చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై సోమవారం కాంగ్రెస్ నాయకులు దుండిగల్ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫాక్స్‌సాగర్ నాలా ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో కొందరు మట్టితో నింపుతున్నారని అన్నారు. ఇప్పటికే వర్షాలు పడ్డ సమయంలో వరదనీరు వెళ్లేందుకు దారి లేక కాలనీలు, బస్తీలు ముంపు బారిన పడుతున్నాయని పేర్కొన్నారు. ఈ ఆక్రమణలపై అధికారులు చర్యలు తీసుకుని చెరువు స్థలాలను పరిరక్షించాలని కోరారు. నాయకులు కావలి గోపాల్‌ముదిరాజ్, జయభేరి గోపాల్‌రెడ్డి, ప్రభాకర్‌గుప్తా, కావలి నవీన్‌ముదిరాజ్ ఉన్నారు.

డంపింగ్‌యార్డును తరలించాలి

ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు

నిజాంపేట్: జనవాసాలకు చేరువలో ఉన్న డంపింగ్ యార్డుతో చుట్టు పక్కల కాలనీలు, బస్తీల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని బాచుపల్లి మండల సీపీఐ కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ అన్నారు. సోమవారం మేడ్చల్ జిల్లా ప్రజావాణిలో డంపింగ్ యార్డును తరలించాలని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ డంపింగ్‌యార్డులో డబుల్‌బెడ్ రూమ్ గృహాలు, సాయినగర్, జర్నలిస్టు కాలనీ వాసులు అనారోగ్యం బారిన పడుతున్నారని తెలిపారు. కార్పొరేషన్ అధికారుల దృష్టికి ఎన్నిమార్లు తీసుకువెళ్లినా మారుస్తామంటున్నారే తప్ప ఆచరణలో సాధ్యపడటం లేదన్నారు. అదే విధంగా చెత్త సేకరణ కార్మికులను బెదిరించి కొందరు డబ్బులు వసూలు చేస్తున్నారని తెలిపారు. ఈ సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమామహేష్, సీపీఐ సమితి సభ్యులు హరినాథ్ రావు, ప్రభాకర్, ఇమామ్, యాదయ్య తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించాలి



ఉపకమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ప్రధాన కార్యదర్శి అల్లా బకాష్

చింతల్: కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించాలని 'ప్రజా బాధ్యతలు – హక్కుల చైతన్య వేదిక' ప్రధాన కార్యదర్శి అల్లా బకాష్ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. సోమవారం గాజులరామారం డీసీ మల్లయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అల్లా బకాష్ మాట్లాడుతూ.. భగత్‌సింగ్‌నగర్ ప్రధాన రోడ్డులోని శ్రీనల్లపోచమ్మ ఆలయం వెనుక భాగంలో 4500 గజాల ప్రభుత్వ భూమి ఉందన్నారు. గతంలో రూ.26.80 లక్షల జీహెచ్‌ఎంసీ నిధులతో సదరు స్థలం చుట్టూ ప్రహరీ నిర్మాణాన్ని చేపట్టి దాదాపు 90 శాతం పూర్తి చేశారన్నారు. మిగిలిన పనులు జరగకుండా కొందరు వ్యక్తులు ఆటంకం సృష్టిస్తున్నారని తెలిపారు. అధికారులు వెంటనే ప్రహరీని పూర్తి చేసి ప్రజా అవసరాలకు సదరు స్థలాన్ని వినియోగించాలని కోరారు. సంక్షేమ సంఘం నాయకులు గురువారెడ్డి, నందు, మల్లేష్, చంద్రమౌళి, బిస్పల్లి రాజు, జాన్సన్, యాదగిరి, రామకృష్ణ, శేఖర్ తదితరులు ఉన్నారు.

నాసిరకంగా అభివృద్ధి పనులు



పునాదుల వరకు పూర్తయిన గాంధీనగర్‌లోని మహిళ భవన నిర్మాణం



భవన నిర్మాణంలో కాంట్రాక్టర్ వినియోగిస్తున్న రాక్‌సాండ్

రంగారెడ్డినగర్: అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో జీహెచ్‌ఎంసీ నిధులు వెచ్చించి చేపడుతున్న అభివృద్ధి పనులు నాసిరకంగా కొనసాగుతున్నాయి. దీంతో లక్షలాది ప్రజాధనం దుర్వినియోగం అవుతోంది. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని గాంధీనగర్ వార్డు కార్యాలయం ఎదురుగా ఉన్న పాత శిథిల భవనాన్ని జీహెచ్‌ఎంసీ అధికారులు కూల్చివేసి మూడు నెలల క్రితం రూ.25 లక్షల నిధులతో కొత్తగా మహిళా భవనానికి శంకుస్థాపన చేశారు. అయితే రాష్ట్ర శాసనసభ ఎన్నికల నేపథ్యంలో ఆగిపోయిన పనులు ఇటీవల మరలా ప్రారంభమయ్యాయి. సదరు పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా భవన నిర్మాణాన్ని చేపడుతున్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. భవన పునాదుల నిర్మాణంలో ఇసుకకు బదులుగా రాక్‌సాండ్‌ను వినియోగిస్తున్నాడని చెప్పారు. పూర్తి భవనానికి రాక్‌సాండ్‌ను వాడితే పటిష్టత దెబ్బతినే ప్రమాదం పొంచి ఉందని పలువురు పేర్కొంటున్నారు. పనులు జరుగుతున్న సమయంలో సంబంధిత అధికారుల నిఘా లేకపోవడంతో కాంట్రాక్టర్ ఆడిందే ఆట.. పాడిందే పాటగా ఉంటోందని, ఇప్పటికైనా సర్కిల్ అధికారులు నాసిరకంగా జరుగుతున్న భవన విషయంలో స్పందించి తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రభుత్వ భూముల కబ్జాపై

విచారణ జరిపించాలి

మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నేత కూన శ్రీశైలంగౌడ్



మేడ్చల్ కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో కూన శ్రీశైలంగౌడ్ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

నిజాంపేట్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో జరిగిన రూ.25వేల కోట్ల ప్రభుత్వ భూమి కబ్జాలపై విచారణ జరపాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. సోమవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి, నిజాంపేట్ అధ్యక్షుడు ఆకుల సతీష్‌లతో కలిసి శ్రీశైలంగౌడ్ భూముల కబ్జాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

- ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక్క నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోనే రూ.25వేల కోట్ల విలువ చేసే 1250 ఎకరాల ప్రభుత్వ భూములు కబ్జాకు గురయ్యాయని, అక్రమణదారులకు సహకరించిన నాయకులు, అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. ఫిర్యాదులో పేర్కొన్న సర్వే నంబర్లలోని ప్రభుత్వ భూమిని తక్షణమే పరిరక్షించి ప్రజా ఉపయోగ కార్యక్రమాలకు కేటాయించాలన్నారు.
- గాజులరామారం, సూరారం, పేట్‌బషీరాబాద్‌ల పరిధిలోని సర్వేనంబర్లు 307, 342, 329, 49, 25/1, 100లలో రూ.10వేల కోట్ల విలువ చేసే దాదాపు 540 ఎకరాలు కబ్జా చేసి విక్రయాలు జరిపారని అన్నారు. వాటిలో ఫీనిక్స్ వంటి బడా కంపెనీలు భారీ నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు.
- దుండిగల్ సర్వే నంబర్ 170, బౌరంపేట సర్వేనంబర్ 166లలోని ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలకు గతంలో ఇక్కడ కలెక్టర్‌లుగా పనిచేసిన హరీష్, తహసీల్దార్ భూపాల్‌లు ఇబ్బడి ముబ్బడిగా ఎన్‌ఓసీలు జారీ చేశారని తెలిపారు. వాటి విలువే వెయ్యి కోట్ల పైచిలుకు ఉంటుందన్నారు. బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకుల కనుసన్నల్లో జరిగిన భూఆక్రమణలపై విచారణ జరిపించి దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. నాయకులు శ్రీనివాస్‌గౌడ్, భిక్షపతి, అరుణ్‌రావు, కౌశిక్ నాయుడు, ఈశ్వర్‌రెడ్డి, ముఖేష్ ఉన్నారు.

ఎట్టకేలకు స్పందించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..



మ్యాన్‌హోళ్లను శుభ్రం చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

దుండిగల్: అధికారులు ఎట్టకేలకు స్పందించారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధి దుండిగల్ తండా–2లో మురుగు నీటి సమస్య తీవ్రంగా ఉంది. ప్రధాన రోడ్డు మ్యాన్‌హోళ్లు నిండి రోడ్లపై మురుగు పారుతుండటంతో పాటు తిరిగి వెనక్కి ఇళ్లల్లోకి వస్తుంది. ఈ విషయంపై 'సాక్షి'లో సోమవారం 'ముక్కు మూసుకోవాల్సిందే' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై దుండిగల్ మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించారు. శానిటరీ సిబ్బందితో మ్యాన్‌హోళ్లల్లో పూడిక తీయించి మురుగు నీరు సాఫీగా వెళ్లేందుకు చర్యలు చేపట్టారు. దీంతో తండావాసులు హర్షం వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్ల క్రితం వేసిన పైపులైన్ల కారణంగా మురుగు సమస్య ఉత్పన్నం అవుతోందని.. సామర్థ్యం పెంచి నూతన పైపులైన్లు ఏర్పాటు చేస్తే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని స్థానికులు పేర్కొంటున్నారు.

కాంగ్రెస్ హయాంలోనే అన్నివర్గాలకు న్యాయం



టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డిని కలిసిన సర్గారి కృష్ణారెడ్డి

దుండిగల్: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి అన్నారు. టీడీపీ సీనియర్ నాయకుడు సర్గారి కృష్ణారెడ్డి సోమవారం సోమవారం భూపతిరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం భూపతిరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందన్నారు. ప్రజలంగా ప్రభుత్వాన్ని విశ్వసిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దుండిగల్ మున్సిపాలిటీ అధ్యక్షులు మద్దికుంట నవీన్‌రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, బౌరంపేట్ మాజీ సర్పంచ్ మిద్దెల యాదిరెడ్డి, నర్సారెడ్డి వీరారెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయం



డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్ చేతుల మీదుగా విరాళాన్ని అందజేస్తున్న శ్రీనివాస్‌రావు

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ శ్రీనివాస్ నగర్‌కాలనీలోని అయ్యప్పస్వామి ఆలయాభివృద్ధికి దాతలు సహకరించడం అభినందనీయని డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్ అన్నారు. సోమవారం ఆలయంలోని నూతనంగా ఏర్పాటు చేస్తున్న 18 పంచలోహ మెట్లకు అనుమోలు శ్రీనివాస్‌రావు రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు నాగార్జునాచార్యులు (లాలు స్వామి), కార్పొరేటర్ సురేష్ రెడ్డి, వెంకట్‌రెడ్డి గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

జీడిమెట్ల: పేకాట స్థావరంపై జీడిమెట్ల పోలీసులు దాడి నిర్వహించి రూ.1,66,720 నగదుతో పాటు 19మంది పేకాట ఆడుతున్న వ్యక్తులను పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై సతీష్‌రెడ్డి వివరాల ప్రకారం.. సోమవారం సాయంత్రం సుభాష్‌నగర్ రాజస్థాన్ హోటల్ సమీపంలో కొంతమంది గ్రూపులుగా ఏర్పడి పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. వెంటనే అక్కడకు చేరుకున్న జీడిమెట్ల పెట్రోలింగ్ పోలీసులు అదే ప్రాంతానికి చెందిన నాగభూషణం, మల్లేషం, షేక్ గన్నావలి, బి.నరేష్, కె.రామస్, మల్లేష్, సి.హెచ్.నాగదుర్గ ప్రసాద్, టి.అయ్యప్ప, జి.ఉమామహేశ్వరరావు, ఈ.సాయిరామ్ నారాయణ, ఎం.అశోక్, బి.లోవరాజు, ఎస్.బాబ్జి, ఎం.మూర్తి, కె.ప్రవీణ్‌కుమార్, కె.నాగేందర్, కె.బాస్కర్, యూ.శ్రీనివాసరావు, సుబ్బారావులను అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.1,66,720 లను స్వాధీనం చేసుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: విద్యుత్ ఫీడర్‌లైన్ల నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం తలెత్తనుందని బాచుపల్లి సెక్షన్ ఏఈ శాంతకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు సాయినగర్, రాజీవ్‌గృహకల్ప, జీపీఆర్ లేఅవుట్, ఐడీపీఎల్ కాలనీ, రెయిన్‌బో కాలనీ, ప్రణీత్, కేఆర్‌సీఆర్ కాలనీ, క్రాంతినగర్ కాలనీ, శ్రీహోమ్స్ కాలనీ, శ్రీనివాస లేక్‌వ్యూ, బాచుపల్లి పోలీస్‌స్టేషన్, ఎస్ఎల్‌జీ ఆస్పత్రి, మమత ఆస్పత్రి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ పేర్కొన్నారు.

- ప్రగతినగర్ సెక్షన్ 11కేవీ మధురానగర్ ఫీడర్ పరిధిలో ఇన్‌కాయిస్ రోడ్డు, మోర్ సూపర్ మార్కెట్, అంబాభవానీ హోటల్, ప్రగ్నా స్కూల్ ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.
- ప్రగతినగర్ ఫీడర్ పరిధిలోని ప్రగతినగర్ ఎలిఫెంట్ సర్కిల్, ప్రగతి సెంట్రల్ స్కూల్, శ్రీమంకీస్ సెంటర్, బచ్‌పన్ స్కూల్ ఏరియాల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4.30గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ప్రగతి నగర్ ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు.

బాచుపల్లి కౌసల్యకాలనీ నూతన కమిటీ

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ బాచుపల్లి పరిధిలోని కౌశల్యకాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా మరోమారు శివప్రసాద్ శెట్టి ఎన్నికయ్యారు. సోమవారం నిర్వహించిన సంక్షేమ సంఘం ఎన్నికల్లో శివప్రసాద్ ప్యానల్ ఘనవిజయం సాధించింది. ఈ ఎన్నికలలో కౌసల్య కాలనీలో ఉన్న 140 అపార్ట్‌మెంట్ల అధ్యక్షుడు, కార్యదర్శులు పాల్గనగా రెండోసారి శివప్రసాద్‌కు మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీ ప్రజల సహకారంతో స్థానికంగా అభివృద్ధి పనులను కొనసాగిస్తామన్నారు. కమిటీ సభ్యులను కలుపుకుని ముందుకు సాగుతామని పేర్కొన్నారు.

చెస్ టోర్నమెంట్‌లో సత్తాచాటిన దార అఖిల్

జగద్గిరిగుట్ట: ప్రగతి చెస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్టేట్ ఓపెన్ ప్రైజ్‌మనీ చెస్ టోర్నమెంట్ ప్రగతినగర్‌లోని పుచలపల్లి సుందరయ్య భవన్‌లో ఆదివారం జరిగాయి. అండర్ 7, 9, 11, 13 విభాగాలలో పోటీలు జరిగాయి. 5 రౌండ్ల చొప్పున జరిగిన ఈ పోటీలలో జగద్గిరిగుట్ట పాపిరెడ్డినగర్‌కు చెందిన దార అఖిల్ సత్తాచాటారు. అండర్ 9 విభాగంలో ద్వితీయ బహుమతి గెలుచుకున్నాడు. ఈ విజయంపై కోచ్, తల్లిదండ్రులు తమ సంతోషం వ్యక్తం చేశారు.

స్పెషల్ డ్రైవ్‌కు శ్రీకారం

అల్వాల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్‌రావు



కుత్బుల్లాపూర్: అల్వాల్ ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్‌కు శ్రీకారం చుట్టారు. సుచిత్ర నుంచి కొంపల్లి వరకు జాతీయ రహదారి విస్తరణ కార్యక్రమం వేగవంతం కావడంతో భారీ వాహనాలతో ట్రాఫిక్ సమస్య ఎదురవుతూ వస్తుంది. ఈ నేపథ్యంలో గత సంవత్సరం అక్టోబర్ నెలలో రోడ్డుపై వ్యాపారాలు కొనసాగించే స్ట్రీట్ వెండర్స్‌తో సమావేశం ఏర్పాటు చేసి 2024 జనవరి మొదటివారంలో తొలగించే విధంగా అంగీకారానికి వచ్చారు. అయితే కొంతమందివి తొలగించగా మరికొంత మంది యథావిధిగా వ్యాపారాలు కొనసాగిస్తూ వచ్చారు.

- ఈ నేపథ్యంలో ఆది, సోమవారాల్లో అల్వాల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో తొలగింపు ప్రక్రియ చేపట్టారు. దీంతో వ్యాపారస్తులకు ట్రాఫిక్ పోలీసులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ట్రాఫిక్ నియంత్రణకు పూర్తిగా సహకరించాలని గతంలో చెప్పినప్పటికీ కొంతమంది స్ట్రీట్ వెండర్లు పెడచెవిన పెట్టడం మూలంగానే తొలగింపు చేపడుతున్నట్లు ట్రాఫిక్ సీఐ నాగేశ్వరరావు 'సాక్షి'తో అన్నారు.

ఫుట్‌పాత్‌లపై అక్రమ డబ్బాల తొలగింపు



ఫుట్‌పాత్‌పై అక్రమంగా ఏర్పాటు చేసిన డబ్బాలను తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

కుత్బుల్లాపూర్: కొంపల్లి నుంచి సుచిత్ర వరకు జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం కాకుండా సహకరించాలని అల్వాల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు కోరారు. రహదారి విస్తరణలో భాగంగా ఇప్పటికే ప్రత్యేకంగా సర్వీస్ రోడ్ల మీదుగా భారీ వాహనాలతో పాటు ఇతర వాహనాలను దారి మళ్లిస్తున్నామని అన్నారు. స్థానికంగా జరుగుతున్న రోడ్డు అభివృద్ధి పనులకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. మేడ్చల్ ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాసరావు నేతృత్వంలో అడిషనల్ ట్రాఫిక్ డీసీపీ వేణుగోపాల్‌రెడ్డి పర్యవేక్షణలో స్థానికంగా వ్యాపారస్తులతో మాట్లాడారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకొని ముందుకు సాగుతున్నామన్నారు.

ప్రజాపాలన ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తిచేయాలి

సీడీఎంఏ జేడీ కృష్ణమోహన్‌రెడ్డి



ప్రజాపాలన ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న సీడీఎంఏ జేడీ కృష్ణమోహన్‌రెడ్డి

కుత్బుల్లాపూర్: ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను ఈనెల 17వ తేదీ వరకు ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేయాలని.. అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు చేసుకోవాలని కమిషనర్ ఆఫ్ డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ) జాయింట్ డైరెక్టర్ కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని కొంపల్లి మున్సిపాలిటీలో ప్రజాపాలనలో వచ్చిన 8733 దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్న నేపథ్యంలో ఆయన మున్సిపల్ కమిషనర్ శ్రీహరితో కలిసి పరిశీలించారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రక్రియ పూర్తి చేయాలని కోరారు.

- **జంట సర్కిళ్లలో వేగవంతంగా..**

కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను వివిధ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులతో ఆన్‌లైన్ ప్రక్రియ వేగవంతం చేశారు. ఉపకమిషనర్లు నరసింహ, మల్లయ్యలు వారికి తగు సూచనలు చేస్తూ ముందుకు సాగుతున్నారు. కుత్బుల్లాపూర్ సర్కిల్–25లో రంగారెడ్డినగర్ డివిజన్ 15,106, సుభాష్‌నగర్ 25,699, కుత్బుల్లాపూర్ 19,431, జీడిమెట్ల 13,786 దరఖాస్తులు కలిపి మొత్తం 74,022 వచ్చాయి.

- అదేవిధంగా గాజులరామారం సర్కిల్–26లో సూరారం 18,127, చింతల్ 13,609, జగద్గిరిగుట్ట 18,904, గాజులరామారం 23,489 దరఖాస్తులు కలిపి మొత్తం 74,129 వచ్చాయి. ఇలా రెండు సర్కిళ్లలో 1,48,151 దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. సర్కిల్ కార్యాలయం భగత్ సింగ్ నగర్ కమ్యూనిటీహాల్‌లో ఈ ప్రక్రియ కొనసాగుతోంది.

మరోసారి ప్రతిభచాటిన ఎంఎల్‌ఆర్ఐటీ



అవార్డులు అందుకుంటున్న ఎంఎల్‌ఆర్ఐటీ కళాశాల బృందం సభ్యులు

దుండిగల్: ఎంఎల్‌ఆర్ఐటీ కళాశాల మరోసారి ప్రతిభ కనబర్చింది. ఇటీవల కర్నాటక రాష్ట్రంలో ఇండో యూనివర్సల్ కొలాబరేషన్ ఫర్ ఇంజినీరింగ్ ఎడ్యుకేషన్ సహకారంతో కేఎల్ఈ టెక్నాలజికల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ ఎడ్యుకేషన్‌లో ట్రాన్స్‌ఫర్మేషన్‌పై జాతీయస్థాయి పరిశోధనలను ప్రదర్శించారు. అందులో దుండిగల్‌లోని ఎంఎల్‌ఆర్ఐటీ కళాశాల బృందం సభ్యులు రాధికాదేవి, ప్రమోద్‌కుమార్, రాజన్‌సింగ్, అరవింద్‌లు 'బోధన, అభ్యాసం' అనే అంశంపై రెండు పత్రాలను సమర్పించారు. అదే విధంగా 'పాలసీ అండ్ అడ్మినిస్ట్రేషన్ సపోర్ట్'లపై సమర్పించిన పత్రాలపై ప్రశంసలు కురిపించడంతో పాటు అవార్డులు ప్రకటించారు. రాధికాదేవికి టీఎల్‌సీ లీడర్‌షిప్ అవార్డు, డాక్టర్ పి.ప్రమోద్‌కుమార్, డాక్టర్ రాజన్‌సింగ్, డాక్టర్ అరవింద్ కోలా టీఎల్‌సీ అవార్డులతో సత్కరించారు. అదే విధంగా ఇంటిగ్రేటెడ్ స్టూడెంట్స్ ఫోరమ్‌లో ఎంఎల్‌ఆర్ఐటీ విద్యార్థులు సైతం ప్రతిభ చూపారు. వీరిని కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, డైరెక్టర్ మర్రి శ్రేయారెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు అభినందించారు.

అభినందనలు

కుత్బుల్లాపూర్: ట్రస్మా రాష్ట్ర ఎన్నికలల్లో కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన శివరాత్రి యాదగిరి ఎన్నికయ్యారు. తెలంగాణ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం (ట్రస్మా) రాష్ట్ర ఎన్నికలు ఆదివారం జూపల్లి బాలమ్మ గార్డెన్‌లో యాదగిరి శేఖర్‌రావు అధ్యక్షతన జరిగాయి. ఈ ఎన్నికలల్లో ఇప్పటి వరకు మేడ్చల్ జిల్లా అధ్యక్షుడిగా సేవలందిస్తున్న శివరాత్రి యాదగిరిని రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన ఆయనకు సోమవారం ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు అభినందనలు తెలిపాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.


ప్రజా సంక్షేమమే పరమావధిగా పనిచేస్తున్నాం



ఎమ్మెల్యే వివేకానంద్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో సత్కరిస్తున్న సంక్షేమ సంఘం ప్రతినిధులు

కుత్బుల్లాపూర్: ప్రజా సంక్షేమమే పరమావధిగా పని చేస్తూ ముందుకు సాగుతానని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. హ్యాట్రిక్ విజయం సాధించిన ఆయన సోమవారం రెండో రోజు జీడిమెట్ల డివిజన్‌లో కృతజ్ఞత యాత్రను కొనసాగించారు. వెన్నెల గడ్డ, దుర్గా ఎస్టేట్స్, వసంత విహార్, హెచ్ఏఎల్ రాఘవేంద్ర కాలనీ, బ్యాంక్‌కాలనీ, వెంకటేశ్వరనగర్, శ్రీరాఘవేంద్రకాలనీ, వెంకటేశ్వరకాలనీ ఈస్ట్, వెంకటేశ్వరకాలనీ వెస్ట్, గణేష్‌నగర్ హౌసింగ్ సొసైటీలలో పర్యటించిన ఎమ్మెల్యేకు స్థానిక సంక్షేమ సంఘాల ప్రతినిదులు, ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా వివేకానంద మాట్లాడుతూ... తన విజయం ప్రజా విజయమని, తనపై పూర్తినమ్మకంతో మూడోసారి అవకాశం కల్పించిన వారి ఆశయాలకు అనుగుణంగా పని చేస్తానన్నారు. గత తొమ్మిదేళ్లుగా చేపట్టిన అభివృద్ధి స్ఫూర్తితో కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని నంబర్ వన్‌గా నిలిపేందుకు కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యే వెంట బీఆర్‌ఎస్ నాయకులు నరేంద్‌రెడ్డి, ఎల్లాగౌడ్, కాలే నాగేష్, ఏసు, విజయ్, సంజయ్, రాజుయాదవ్, మహిళా నాయకులు ఇందిరరెడ్డి, శ్రీదేవి తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదం గుర్తుతెలియని వ్యక్తి మృతి



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ

కుత్బుల్లాపూర్: గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. దూలపల్లి నుంచి చర్మాస్‌కు వెళ్లే రోడ్డులో సోమవారం తెల్లవారుజామున 5.30 గంటల సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికంగా మూడు రోజుల నుంచి ఒంటరిగా తిరుగుతున్న సదరు వ్యక్తి 5గంటల ప్రాంతంలో స్థానికంగా ఉన్న పెట్రోల్ బంక్ సమీపం నుంచి వెళ్తున్నట్లు సీసీ ఫుటేజ్ లో రికార్డు అయ్యింది. ఇదే క్రమంలో అటువైపుగా వెళ్లిన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టగా మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు పేట్‌బషీరాబాద్ ఎస్సై ప్రవీణ్‌కుమార్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఘటన స్థలాన్ని మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి, అల్వాల్ ట్రాఫిక్ సీఐ నాగేశ్వరరావు సందర్శించి ప్రమాద తీవ్రతను పరిశీలించారు.